క్లుప్తంగా

అనాథ పిల్లలకు కంచాల వితరణ



పిల్లలకు కంచాలు అందిస్తున్న ప్రభాకర్‌నాయుడు

భీమునిపట్నం: భీమిలికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్‌నాయుడు గురువారం అనాథ పిల్లలకు స్టీల్ కంచాలు అందించారు. ఇటీవలన ఆయన తల్లి రాంభుక్త భూలక్ష్మి మరణించడంతో, ఆమె జ్ఞాపకార్థం ఈమేరకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీలో పిల్లలకు 180 కంచాలను అందజేశారు.

108 మందికి కళ్లద్దాల పంపిణీ

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 108 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. జూలై 6న నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో పరీక్షలు చేసిన అనంతరం, కళ్లద్దాలు అవసరమని గుర్తించిన వారికి ఇప్పుడు అందజేశారు. అలాగే అప్పట్లో 18 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశామని, అదేరోజు నిర్వహించిన దంత వైద్యశిబిరంలో 12 మందికి రూట్‌కెనాల్ చికిత్స చేయించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బమ్మిడి శ్రీతారక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సీవోఈలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు



మధురవాడ రిక్షా కాలనీలోని గురుకుల బాలికల సీవోఈ

మధురవాడ: మధురవాడ రిక్షా కాలనీలోని విశాఖపట్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో 2025–26 విద్యా సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిరివరపు సత్యవతి తెలిపారు. ఇక్కడ 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సీట్లు ఖాళీ ఉన్నాయని చెప్పారు. ఇందులో చేరడానికి ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివిన ఎస్సీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గలవారు పాఠశాల పనివేళల్లో సంప్రదించాలని సూచించారు. ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

332 మందికి కంటి పరీక్షలు



రేవిడి హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశాఖ కంటి ఆస్పత్రి ట్రస్ట్ గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 332 మందికి పరీక్షలు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 256 మందికి, ప్రాథమిక పాఠశాలకు చెందిన 76 మందికి ఈ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులకు కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. సాయి కృష్ణ కుమార్, కె.సరోజిని దేవి, ఎం.ప్రియాంక ఈ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భీమిలి మండల నూతన కార్యవర్గం ఎన్నిక, ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం గురువారం భీమిలి ఎన్జీవో కార్యాలయంలో జరిగాయి. మండల నూతన అధ్యక్షునిగా ఇ.మహాలక్ష్మినాయుడును, ప్రధాన కార్యదర్శిగా కరుభుక్త సన్యాసినాయుడును కార్యవర్గ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 20 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.శ్రీనివాస్, పరిశీలకునిగా బి.ముత్యాలనాయుడు వ్యవహరించారు. నూతన కార్యవర్గం పలు అంశాలపై తీర్మానాలు చేసింది. అనంతరం ఇటీవల బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.దాలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం మాటున అపాయం

వర్షాలకు నిండుకుండలా తొణికిసలాడినా.. వర్షాభావంతో నీరు తగ్గినా ఆహ్లాదకర వాతావరణంతో గంభీరం రిజర్వాయర్ పర్యాటకులను ఆహ్వానం పలుకుతూనే ఉంటుంది. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా విద్యార్థులు, సందర్శకులు వస్తూనే ఉంటారు. అయితే ఈ ఆహ్లాదం మాటున ప్రమాదాలూ పొంచి ఉంటున్నాయి. వాటిని అరికట్టేందుకు జీవీఎంసీ గానీ, ఆనందపురం పోలీసులు గానీ, అటవీశాఖ గానీ చర్యలు తీసుకోకపోవడమే ఆందోళన కలిగిస్తోంది.

- ప్రమాదకరంగా గంభీరం రిజర్వాయర్
- పర్యాటకుల ముసుగులో ఆకతాయిల రాక
- కాపలాదారులు లేక అక్కడే తిష్ట
- ఫెన్సింగ్/సెక్యూరిటీ ఏర్పాటుతోనే రక్షణ



ప్రమాదకరమైన రిజర్వాయర్ వాలు ప్రాంతం



రిజర్వాయర్ దిగువ ప్రమాదకరమైన నీళ్లులేని బక్కెట్



రిజర్వాయర్‌లో నీరు తక్కువగా ఉన్న, రెయిలింగ్ లేని లాకు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలో సుమారు 300 ఎకరాలలో రిజర్వాయర్ విస్తరించింది. ఇక్కడికి నిత్యం చుట్టుపక్కల విద్యాసంస్థల విద్యార్థులతో పాటు నగరం నుంచీ సందర్శకులు వస్తుంటారు. స్నేహితులతో సరదాగా వచ్చిన వారు మద్యం సేవించడం, రెయిలింగ్ రక్షణ లేని లాకులపై నిలబడి సెల్ఫీలు తీసుకోవడం, నీటిలోకి డైవ్ చేయడం వంటి విన్యాసాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణాలు రిజర్వాయర్ గాలిలో కలిసిపోతున్నాయి. రిజర్వాయర్ చుట్టూ ఉన్నవారికే ఇందులో ఎక్కడ లోతు తక్కువగా ఉంది? ఎక్కడ గుమ్ము ఉందో తెలియని పరిస్థితి. 1957లో పాత రిజర్వాయర్‌ను కూల్చినప్పటి శిథిలాలు ఇప్పటికీ ఇందులో ప్రమాదకరంగా మారాయి. అవి ఈతకు దిగినవారి ప్రాణాలు తోడేస్తున్నాయి. రిజర్వాయర్‌ను ఆనుకుని కంబాల కొండ అభయారణ్యం ఉన్నందున ఇక్కడ అడవి పిల్లులు, పాములు, నక్కలు, తోడేళ్లు, కొండ చిలువలు, అడవిపందులు, పక్షులు సంచరిస్తుంటాయి. ఒంటరిగా ఈ ప్రాంతానికి రావడం ఆపదతో కూడుకున్నదే అయినా.. బోయపాలెం, దుక్కవానిపాలెం మీదుగా నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు.



రిజర్వాయర్ చుట్టూ ప్రమాదకరమైన రాతిబండ



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన రిజర్వాయర్ గట్టు



మెట్ల ద్వారా ఆకతాయిలు లాకుపై చేరే మార్గం

పర్యాటక కేంద్రంగా వసతులు కల్పించాలి



గంభీరం రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది వసతులు కల్పించాలి. అప్పుడే అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అరికట్టవచ్చు. పర్యాటకులకు కాఫీ షాపు, హోటల్, టాయిలెట్లు, షెల్టర్లు వంటివి అందుబాటులోకి తీసుకురావాలి. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలి.

– జల్లు తిరుపతిరావు, చిట్టివలస

రెయిలింగ్ లేని లాకులపై తిష్ట

జూలై ముగుస్తున్నా ఆశించిన వర్షాలు కురవని కారణంగా రిజర్వాయర్ పరిసరాలు వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం చుట్టూ కొండల నడుమ రిజర్వాయర్‌లో ఉన్న నీరు గేట్లకు 30 అడుగు దూరం వరకు నిలిచి ఉంది. గత నెలలో రిజర్వాయర్‌లో పలుచోట్ల అడుగు భాగం కనిపించగా ప్రస్తుతం కొద్దిపాటి నీరు చేరింది. జీవీఎంసీ ప్రజలకు ప్రధాన తాగునీటి వనరు అయిన ఈ రిజర్వాయర్ ఈ సీజన్‌లో ఇంత దూరంగా నీరు ఎప్పుడూ లేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. దీంతో గేట్లు, మెట్లు, 20 అడుగుల నీటి వాలు ప్రాంతం, 4 అడుగుల లోతు కలిగిన బక్కెట్ ప్రాంతం నాచుతో కాకుండా పొడిగా కనిపిస్తున్నాయి. రిజర్వాయర్ వద్దకు వచ్చే ఆకతాయిలు దీని చుట్టూ ఉన్న రాతిబండ, దుక్కవానిపాలెం నుంచి రిజర్వాయర్‌పైకి చేరుకునే గట్టు, రక్షణగా రెయిలింగ్ లేని లాకులపై తిష్ట వేస్తున్నారు. ఒక్కోసారి వీరి మధ్య చిన్న చిన్న తగాదాలు చిలికి చిలికి గాలివానగా మారి, ప్రాణాల మీదకు వచ్చినా అడిగేవారు ఇక్కడ ఉండరు. రిజర్వాయర్‌లో నిండుగా నీరు చేరినప్పుడు మాత్రం చేపల పెంపకందారులు, జీవీఎంసీ తాగునీటి సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. దూరప్రాంతాల నుంచి బంధువులు వచ్చినప్పుడు కచ్చితంగా ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఒకరిద్దరు ఈ ప్రాంతానికి రావడం ప్రమాదకరం. ఆకతాయిల నుంచే కాకుండా జంతుజాలం నుంచి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా వన్యప్రాణులు రిజర్వాయర్‌లో నీటిని తాగేందుకు మధ్యాహ్నం వేళ, చీకటి పడిన తరువాత వస్తుంటాయని గంభీరం పంచాయతీ ప్రజలు హెచ్చరిస్తున్నారు. కేవలం హెచ్చరికల బోర్డులే కాకుండా లాకులపై నడవకుండా రిజర్వాయర్‌లో దిగకుండా ఫెన్సింగ్ లేదా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రిజర్వాయర్‌లో దిగకుండా చూడాలి



రిజర్వాయర్ లోతుపాతులు తెలియక సరదాగా దిగినవారు ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిని అరికట్టాలి. పర్యాటక, అటవీశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇందులో బోటు షికారు ఏర్పాటు చేస్తే కాస్త మేలు జరుగుతుంది.

– ఒమ్మి దేవుడు, భీమన్నదొరపాలెం

చీకటి పడితే ప్రమాదం



గంభీరం రిజర్వాయర్ సీజన్‌తో సంబంధం లేకుండా అందరినీ ఆకర్షిస్తుంది. కానీ చాలామంది విద్యార్థులు క్లాసులు ఎగ్గొట్టి ఇక్కడ కాలక్షేపం చేస్తుంటారు. అదే కొన్నిసార్లు ప్రమాదాలకు దారి తీసి, తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తుంది. చీకటి పడిన తరువాత ఎవరూ ఇటు రాకుండా చూడాలి.

– కాసా శేఖర్, గాజువాక

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బెందాళం పద్మావతి మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం మరింత కష్టపడి పనిచేస్తానని పేర్కొన్నారు.

– కొమ్మాది

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో తాటిచెట్లపాలెం, దసపల్లా లే అవుట్, సుభాష్‌నగర్, ముసలయ్యపాలెం, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సచివాలయాలకు 20 చెత్త సేకరణ రిక్షాల అందజేత



చిప్పాడ సచివాలయం వద్ద చెత్త సేకరణ రిక్షాలు అందిస్తున్న దివీస్ సీఎస్ఆర్ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం రూ.5.60 లక్షల సీఎస్ఆర్ నిధులతో గ్రామ సచివాలయాలకు 20 చెత్త సేకరణ రిక్షాలను గురువారం అందజేసింది. వీటిలో చిప్పాడకు 4, పెదనాగమయ్యపాలెం 3, మూలకుద్దు 3, తూడెం 2, లింగాలవలస 2, గుడివాడ 2, చెరకుపల్లి 2. టి.నగరపాలేనికి 2 ఉన్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న సీఎస్ఆర్ అధికారి డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సహాయపడేందుకు వీటిని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు కె.నరసింహ, శ్రీనివాస్, శేఖర్‌బాబు ఆయా పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల రద్దుకు మరో విద్యుత్ ఉద్యమం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు

మధురవాడ: ప్రజలపై భారం మోపే స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు, సీపీఎం జిల్లా నాయకుడు దొడ్డి అప్పలరాజు తెలిపారు. అవసరమైతే మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధమని స్పష్టం చేశారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మధురవాడ సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలకు తిలోదకాలు ఇచ్చి, ప్రజలపై విద్యుత్ చార్జీలు భారీగా మోపడం దారుణంగా మోసగించడమేనన్నారు. గత ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రద్దు చేస్తామని, అక్రమంగా జరిగిన సోలార్ ఒప్పందాలు రద్దుచేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పటికి 4 సార్లు విద్యుత్ భారాలు మోపారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వివిధ దశల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఆగస్టు 2న మధురవాడలోని విద్యుత్ శాఖ జోన్–3 ఈఈ కార్యాలయం వద్ద, 5వ తేదీన సీతమ్మధార ఏపీఈపీడీసీఎల్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు నివాస్ నాయకుడు బీఎస్ మూర్తి, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా నాయకులు జేడీ నాయుడు, పి.రాజ్‌కుమార్ వివిధ ప్రజా సంఘాలు నాయకులు ఎండీ బేగం, సత్యనారాయణ, బి.భారతి, డి.కొండమ్మ, కె.అచ్యుతరావు, శేఖర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదల తరఫున ప్రశ్నించేందుకే వచ్చాం

- వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే..
- పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



హాజరైన దాకమర్రి గ్రామస్తులు

తగరపువలస: ఎన్నికల మ్యానిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఏడాదిగా ప్రజలకు అందవలసిన పథకాలన్నీ అమలు చేసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అనిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు సూపర్‌సిక్స్‌లోని నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ బకాయిలు చెల్లించాలని, మహిళలకు ఉచిత బస్సు అమలు చేయాలని అన్నారు. భీమిలి మండలం దాకమర్రిలో గురువారం జరిగిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పంచాయతీ వాసులను ఉద్దేశించి మాట్లాడారు. రాజు సరైనోడు అయితే ప్రకృతి కూడా సహకరిస్తుందన్నారు. ఆగస్టు వచ్చినా బాబు పాలనలో సాగుకు సంబంధించి నాట్లు, దమ్ములు, ఈ క్రాప్, ఈకేవైసీ చివరకు వర్షాలు కూడా లేవన్నారు. అందువలన సూపర్‌సిక్స్‌లో నుంచి అన్నదాత సుఖీభవ పథకం ఎగ్గొట్టవచ్చని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరఫున పని చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం 14 నెలలుగా సంక్షేమ పథకాలు అమలు చేయనందున పేదవారు, అమాయకులైన వారి తరఫున కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాబును ఎన్నడూ నమ్మని ప్రజలు.. హామీలపై ప్రశ్నిస్తారనుకున్న పవన్, బీజేపీలను చూసి ఓట్లు వేసి మోసపోయారన్నారు. ప్రజల ఆశలను ఓట్లుగా మలచుకుని మరో మారు ప్రజలను చంద్రబాబు వంచించాడన్నారు. పథకాలు అమలు చేయకపోతే ప్రజల ముందు కూటమి ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామన్నారు.

జగన్ ప్రజల మధ్యకు వస్తే వారికి వణుకు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన నడుస్తోందని, వారి దుష్టపాలనలో బాధితులైన వారిని పరామర్శించడానికి రాష్ట్రంలో 40 శాతం ఓటింగ్ కలిగిన ప్రతి పక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే కూటమి ప్రభుత్వం వణికిపోతోందన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించినట్టు రోడ్లు తవ్వేసి, ప్రజలను కట్టడి చేసి పోలీసు వలయాలతో నిర్బంధానికి దిగుతుందన్నారు. అడుగడుగునా ఆటంకాలు కలిగించి జగన్‌కు ప్రజల్లో ఉన్న చరిష్మాను చెరిపేయలేరన్నారు. కేవలం 14 నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వం ఎనలేని అపకీర్తిని మూటకట్టుకుందన్నారు. మరో మూడున్నరేళ్ల తర్వాత ప్రజలు ఇచ్చే తీర్పునకు కూటమి భాగస్వామ్యం కూసాలు కదిలిపోతాయన్నారు. ఇప్పటికే జిల్లాకు మంత్రిని కూడా కూటమి ప్రభుత్వం పెట్టుకోలేక పోగా ఎమ్మెల్యే, మంత్రులు ప్రజల మధ్యకు రావడానికి సాహసించడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సరగడ రఘునాథరెడ్డి, మజ్జి సూరినాయుడు, సమ్మిడి శ్రీనివాసరావు, చిల్ల హరి తోగులు రెడ్డి, చిల్ల దేవిచిట్టి, మజ్జి నారాయణరావు, మల్లేటి హరిశంకర్, మద్దిల శివకుమార్ గంధవరపు ఉష, చెల్లూరు రావణ సంతోష్, గెద్ద చిరంజీవి, చెల్లూరు ఆది, బోని శ్రీను బొట్ట అప్పన్న, కంఠిమహంతి దయాప్రసాద్, బొట్ట పైడయ్య, ముగడ ఎర్రయ్య, లొడగల శ్రీను, గిడుతూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పీటర్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో రమణ, ఉపాధ్యాయులు



పీవీ లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పద్మనాభం: పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. తునివలస ప్రాథమిక పాఠశాలలో పని చేసిన ఎం.పీటర్స్ దంపతులకు పద్మనాభం జిల్లా బంగ్లా ప్రాంగణంలో, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసిన ఎం.శ్రీరామ్ కిశోర్ దంపతులను ఆ పాఠశాలలో సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు వారిని దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాల్లో డీసీఈబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అరుణ్ కుమార్, ఆర్.జగదీష్ బాబు, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని లక్ష్మికి ఆత్మీయ వీడ్కోలు

తగరపువలస: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయిని పుట్రేవు వెంకటలక్ష్మి రిటైర్మెంట్‌ను పురస్కరించుకుని, గురువారం ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. 38ఏళ్ల పాటు ఆమె అందించిన సేవలు, సాధించిన విజయాల గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. పాఠశాలలను కలెక్టర్ వంటి అగ్రశ్రేణి అధికారులు తనిఖీ చేసినప్పుడు కూడా వారి ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. ఆమెను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాణి, ప్రధానోపాధ్యాయిని శివజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పరవాడ: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ మహిళా ఎస్ఐ మహాలక్ష్మి సూచించారు. తానాం గురుకుల పాఠశాలలో సైబర్ మోసాలు, ఈవ్ టీజింగ్, మహిళా భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం చట్ట వ్యతిరేకమన్నారు. మొబైల్ ఫోన్లలో సైబర్ నేరగాళ్లు పెడుతున్న మోసపూరితమైన మెసెజ్‌లకు స్పందించకూడదని హెచ్చరించారు. మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన



సంగివలసలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్

తగరపువలస: హెచ్‌ఐవీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, మొబైల్ ఐసీటీసీ సంయుక్త ఆధ్వర్యంలో చిట్టివలస, సంగివలస గ్రామాల్లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. గర్భిణులు తొలి త్రైమాసికంలోనే హెచ్‌ఐవీ, సిఫిలిస్ పరీక్షలు చేయించుకుని బిడ్డను సంక్రమణ ప్రమాదం నుంచి రక్షించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 56 మందికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్‌కుమార్, లింక్ వర్కర్ ఎం.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిపించారు.

డీటీ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్

భీమునిపట్నం: భీమిలి డిప్యూటీ తహసీల్దారుగా బి.ఎస్.ఎస్.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెదగంట్యాడ తహసీల్దారుగా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన శ్రీనుబాబు పదోన్నతిపై ఆనందపురం తహసీల్దారుగా వెళ్లారు.